# గర్వభంగం

పరాంకుశం గారు సంగీతంలో అంత గొప్ప విద్వాంసుడు కాకపోయినా ఘటికుడే! అయితేనేం? ఆయనగారికి "గర్వం" ఎక్కువ. కచేరీ వస్తున్నాడు, అంటే, అవతలి వాళ్ళని ముప్ప తిప్పలూ పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగిస్తాడు. ఖరీదైన శాలువాతో సన్మానం చెయ్యాలని, డబ్బు ఎక్కువగా ముట్ట చెప్పాలని, కారులో తీసుకువెళ్ళి, కారులో తీసుకువచ్చి, ఇంటి దగ్గర దిగబెట్టాలని ఇలాంటి గొంతెమ్మ కోరికలు ఎన్నెన్నో కోరేవాడు.

ఆ వూళ్ళోనే హరిదాసు రంగయ్య గారు వుంటున్నారు. పేదరికంలో అలమటిస్తున్నారు. ఏవూటకి ఆ వూట గడవడం కష్టంగావుండేది. ఆయన గారికి హరికథలు చెప్పే అవకాశాలు తక్కువగా వస్తూండేవి. అయితేనేం? ఆయన మంచి తనమేఆయన్ని కావు కాస్తోంది. ఊళ్ళో అందరూ 'దాసుగారు' అని గౌరవంగా పిలిచేవారు.

ఎందుకనో పరాంకుశం గారికి, దాసుగారు అంటే గిట్టేది కాదు. ఆయన్ని చిన్న చూపు చూసేవాడు. ప్రక్కన ఎవరున్నా సరే దాసుగారు తారసపడితే ఆయన్ని వేళాకోళం చేస్తూ వ్యంగ్యంగా మాట్లాడేవాడు. అందుకు దాసుగారు మనసులో బాధపడినా, పైకి చిరునవ్వుతోనే సమాధానం చెప్పేవారు.

ఒకరోజు దాసుగారు హడావిడిగావెళ్తూండగా పరాంకుశంగారు ఎదురుపడి పలకరించారు! "ఏమయ్యా దాసు! మొన్న నా సంగీత కచేరీకి రమ్మని నీకు మరీ మరీ చెప్పానుకదా! కొన్ని కొత్త కృతులు పాడతానని! మరి నీకోసం అంతమంది జనంలోనూ కలయ చూశాను! నువ్వు కన్పించలేదు? అయితే రాలేదన్న మాట!" అన్నారు చిరుకోపాన్ని ప్రదర్శిస్తూ

పరాంకుశంగారి వెనుకనే వున్న వూరి పెద్దలు ఇద్దరు 'దాసు ఏం చెబుతాడా?' అని ఆత్రంగా చూశారు!

పరాంకుశంగారు ఎప్పుడు, ఎక్కడ కచేరీ చేసినా ముందుగా "హరి ఓం" అనే మాటతో ప్రారంభిస్తారు. అది దాసుకి తెలుసు.

"ఏమయ్యా దాసు! మాట్లాడవేం? నేనే అంతగా చెప్పినా నీకు నామాట మీద గౌరవం లేనట్టేగా?" అన్నారు పరాంకుశంగారు బాధపడుతున్నట్టు నటిస్తూ!

వెంటనే దాసుగారు అన్నారు!

"భలేవారేనండి! మీరు రమ్మనడం, నేను రాకపోవడమూనా! మీరు వేదిక మీద "హరీ" మన్నప్పటినుంచీ నేను అక్కడే వున్నాను!" అన్నారు.

ఆ మాటకు ప్రక్కనున్న వూరి పెద్దలు ఫక్కుమని నవ్వేరు. పరాంకుశంగారు గతుక్కుమన్నాడు.

'హమ్మ! వీడి దుంపతెగ! ఎంత దెబ్బ కొట్టాడు! నేను హరీ మనడం అంటే చనిపో......అమ్మమ్మ...' అనుకున్నాడు బాధగా

ఎలాగయినా తిరగి దాసుని దెబ్బ తీయాలి! అనుకుంటూ అక్కణ్ణించి ముందుకు కదిలాడు, పరాంకుశంగారు!

** ** **.

అది విజయదశమి, దసరా పండుగ రోజులు!

ఒకరోజు దాసుగారు వూళ్ళో ఎవరితోనో మాట్లాడుతూ నడిచి వెళ్తున్నారు. అంతలో దారిలో పరాంకుశంగారు దాసుగారికి ఎదురు పడ్డారు.

"ఏమోయ్! దాసు! ఏమిటి విశేషాలు?" అంటూ, "ఇదిగో ఈ పండుగ సందర్భంగా, నాకు పదిరోజులు వరుసగా కచేరీలు వున్నాయి......వీళ్ళద్దరిదీ పారుగూరు! నాకచేరీ పెడతామని వచ్చారు!" అంటూ గర్వంగా దాసువైపు చూశాడు.

"అదిసరే! ఈసారి తప్పించుకుంటే మాత్రం వూరుకోను. పదిరోజుల్లోను, కనీసం రెండు, మూడు రోజులయినా నా సంగీత కచేరీకి రావాలి! ఎలాగయినా నీకు ఖాళీ వుంటుందిగా!" అన్నారు మరింత గొప్పేగాను, గర్వంగాను, పై కండువా సర్దుకుంటూ.

ఎత్తి పొడుపుకు బాధపడిన దాసుగారు గొంతు సవరించుకుని ఇలా అన్నారు! "మహానుభావులు! మీ మాట కాదంటానా? పండుగ సందర్భంగా నాకు కూడా అయిదారు రోజులు హరికథా కాలక్షేపం చేసే అవకాశం దొరికింది. అంచేత తమరు మరోలా అనుకోవద్దు! నేను ఎలాగయినా వీలు చూసుకుని మీ 'పదో రోజున' వస్తాను"! అన్నారు వినయంగా!

అమాటలకు ప్రక్కనవున్న వాళ్ళకు నవ్వాగలేదు.

—సూరంపూడి విశ్వం, తణుకు




● సమయస్ఫూర్తి:

నడిమింటివారు పొట్టివారైనా బహు గట్టివారు. ఒకసారి భోజనాల సమయంలో వారి వదినగారు వేళాకోళాన్కి అరటి ఆకు నిలువుగా వేసి శాస్త్రిగారికి ఇష్టమైన కందకూరని ఆకు చివరన వేసారు. కందకూర అందక శాస్త్రిగారు ఆలోచిస్తుంటే వారి వదినగారు "ఏవండీ మరిదిగారు! ఎందుకు ఆలోచిస్తున్నారు. 'ఆకందదా'?" అనగా శాస్త్రిగారు సమయస్ఫూర్తితో "ఆ'కందకే'!" అని జవాబిచ్చారు.

● క్షవరం:

సుప్రసిద్ధ కవి, స్వర్గీయ చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారిని తిరుమల తిరుపతి దేవస్థానంవారు సత్కరించారు. ఆ సందర్భంలో మాట్లాడుతూ, "వెంకన్న అందరినీ క్షవరం చేస్తుంటే నేను స్వామి వారిని క్షవరం చేసాను" అని బహుమతి తీసుకుంటూ అందరినీ నవ్వుల్లో ముంచెత్తారు.

— సేకరణ: జ్యేష్ఠ

హిస్టరీ

"మీలో యుద్ధాలంటే ఎవరికి అయిష్టం" క్లాసులోని పిల్లల నుద్దేశించి అడిగాడు హిస్టరీ మాస్టారు.

అందరూ చేతులెత్తారు.

"సరే...యుద్ధాలంటే మీకెందుకింత అయిష్టం" ఓ కుర్రాడినడిగారు మాస్టారు.

"వెధవ యుద్ధాలు జరిగిందగ్గర్నుంచి మేము హిస్టరీలో వాటి గురించి చదవలేక చావాలి కదండీ" దిగులుగా అన్నాడు కుర్రాడు.

— ఆర్. విజయలక్ష్మి, దేవునికడప